క్లుప్తంగా

దేవతామూర్తుల ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్: మండల పరిధిలోని చాప్టా(కె) హనుమాన్ ఆలయంలో సోమవారం నవగ్రహ దేవతా మూర్తుల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ పాల్గొని నవగ్రహాల దేవతామూర్తులకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఈయూఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచి నారాయణరెడ్డి, ప్రశాంత్, దత్తురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

నారాయణఖేడ్: ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో ఆ సంఘం డివిజన్ స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టుల్లో పదోన్నతికి అవకాశం ఉన్నవారు ఒకటి మాత్రమే తీసుకుని మిగతావి తర్వాతి ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. ఎల్‌ఎఫ్‌ఎల్ పదోన్నతుల్లో బీఎడ్ వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. పీఎస్ హెచ్‌ఎంల పోస్టులు పెంచి అధిక సంఖ్యలో ఉన్న ఎస్‌జీటీలకు న్యాయం చేయాలన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, జిల్లా, డివిజన్ బాధ్యులు మల్లికార్జున్, చంద్రకాంత్, జగదీష్, రతన్, మశ్చందర్, ఓంబసవ పాల్గొన్నారు.

విద్యావ్యాపారం తగదు

పటాన్‌చెరు: విద్యతో వ్యాపారం చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి డిమాండ్ చేశారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలో ఉన్న కృష్ణవేణి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ, సాక్సులు, పుస్తకాలు, టై, బెల్టులు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) విద్యార్థి సంఘం నాయకులు పాఠశాలకు చేరుకొని ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో విద్యాశాఖ సిబ్బంది పాఠశాలకు చేరుకొని పరిశీలించారు. సంఘం జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యజమాన్యం ఏం చేసుకుంటారో చేసుకోండి అని విద్యార్థి సంఘాల నాయకులపై దురుసుగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో విద్యా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు అశోక్,ఇసాక్,ప్రవీణ్, మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో 17 రద్దు చేయాలి

జహీరాబాద్ టౌన్: వికలాంగుల ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో 17ను రద్దు చేయాలని ఎన్‌పీఆర్‌డీ నాయకులు సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) డివిజన్ అధ్యక్షుడు కొనింటి నర్సింలు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో వికలాంగుల పట్ల శాపంగా ఉందన్నారు. అంతేకాకుండా అర్హులైన వారికి పెన్షన్ అందకుండా పోతుందని తెలిపారు. వికలాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా తీసుకొచ్చిన జీవోను రద్దు చేసి జీవో నంబర్1ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రతి నెల 5 తేదీ లోపు పింఛన్ డబ్బులను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, రాజు, వాజిద్, శివరాజ్, మచ్చేందర్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఝరాసంగం(జహీరాబాద్): హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని ఏడాకులపల్లి, జూనేగావ్, ఇస్లాంపూర్ గ్రామాల్లో సోమవారం మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధిహామీ ఏపీఓ రాజ్‌కుమార్ ఉన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

నారాయణఖేడ్: ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పిల్లలు అన్నిరంగాల్లో రాణించాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో 'లక్ష్యే లక్ష్యం' పేరిట ఉద్యోగులు, సిబ్బంది పిల్లల కోసం సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు రికార్డింగ్ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సంస్థ ఆదాయం పెరగడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీరు దశరథరావు, ఆర్టీసీ సీఐ నర్సింహులు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, డీసీ రాములు, ఎస్టీఐలు విఠల్, శ్రీనివాస్, బీరయ్య, నగేష్, శివశంకర్, రాధ, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్ పనులు పూర్తయ్యేనా?

- ఏళ్లు గడుస్తున్నా కానరాని పురోగతి
- అభివృద్ధికి నోచుకోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న ర్యాంప్ రోడ్డు

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ నుంచి ఈదులనాగులపల్లి వెళ్లే ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు పనులు నేటికీ పూర్తి చేయకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలో సైతం ఈ రోడ్డు పనులను పూర్తి చేయాలని ధర్నా, నిరసనలు చేపట్టారు. నాటి బీజేపీ నేత, ప్రస్తుత హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా పాల్గొన్నారు. అదే సమయంలో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో తాత్కాలికంగా ర్యాంప్ రోడ్డును అభివృద్ధి చేశారు. మూడు రోజుల క్రితం రింగ్‌రోడ్డుపై వెళ్తున్న భారీ లారీ అదుపు తప్పి ఈ ర్యాంప్ రోడ్డుపై బోల్తా పడింది. ఆ సమయంలో వాహనదారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

నత్తనడకన వంతెన పనులు

గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు కలిసి కొల్లూర్ నుంచి ఈదులనాగులపల్లి వెళ్లే ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం ఇరు గ్రామాల మధ్య ఉన్న రైల్వేలైన్‌పై వంతెన పనులను ప్రారంభించారు. కానీ పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇటీవల మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం సైతం అందజేశారు.

రోడ్డును అడుకున్న అధికారులు

ర్యాంప్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరగడం, స్కూల్ బస్సులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో గతంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ర్యాంప్ రోడ్డుపై సీసీ రోడ్డు పనులను ప్రారంభించగా పనులను హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుకున్నారు. దీంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం



ఇటీవల ర్యాంప్ రోడ్డుపై బోల్తాపడిన భారీ వాహనం

అధికారులు తాత్కాలికంగా అభివృద్ధి చేసిన ర్యాంప్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ రోడ్డుపై కొంచెం అదుపు తప్పినా అంతే సంగతులు. వీటికి తోడు రింగ్ రోడ్డుపై వెళ్లే భారీ వాహనాలు ఎప్పుడు వచ్చి ఈ రోడ్డుపై బోల్తా పడతాయో తెలియని పరిస్థితి ఉంది. మూడు రోజులు క్రితం ఓభారీ వాహనం రింగ్‌రోడ్డుపై నుంచి వచ్చి ర్యాంప్ రోడ్డుపై పడింది. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలి



కొల్లూర్, ఈదులనాగులపల్లి మధ్య ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డును ప్రభుత్వం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇరు గ్రామాల మధ్య రైల్వేలైన్‌పై వంతెన పనులు పూర్తయ్యే లోపు సర్వీస్ రోడ్డును సైతం పూర్తి చేయాలి. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీధర్, వెలిమెల, గ్రామస్తుడు

రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లాం



ఎన్నికల ప్రచార సమయంలో భాగంగా స్థానికులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారు. గెలిచిన వెంటనే ఈ విషయంపై రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం అందజేశాం. ఇరు గ్రామాల మధ్య ఉన్న రైల్వేలైన్‌పై నిర్మిస్తున్న వంతెన పనులను వచ్చే ఫిబ్రవరి వరకు పూర్తి చేస్తాం. ఈ విషయమై ఇటీవల తెల్లాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకోని పోవడం జరిగింది. సమస్య పరిష్కారాని తన వంతు కృషి చేస్తాను.

– ఎంపీ రఘునందన్‌రావు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



జిన్నారం: గుమ్మడిదలలో...

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాచెరుటౌన్: అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆవరణంలో పాలాభిషేకం ను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ 9 ఏళ్ల పాలనలో 7 వేల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. అదేవిధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని వివరించారు. మంత్రివర్గ సమావేశంలో ఆగస్టు 15 లోపు విడతల వారీగా రూ.31వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. రైతుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశామని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీసీసీ మాజీ కార్యదర్శి మతీన్, ఎట్టన్న, రవి, ముదిరాజ్, సాయిలు, కుంచాల కిషన్, శ్రీనివాస్ ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జిన్నారం(పటాన్‌చెరు): రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో సోమవారం మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులకు న్యాయం చేయండి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని సర్వేనంబర్ 1, జంగంపేటలోని 376 సర్వే నంబర్‌లో ఉన్న భూములను రైతులు ప్రభుత్వానికి అప్పజెప్పారు. దీంతో ఎకరాకు 600 గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఇవ్వకపోవటంతో కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ లావణ్య మాట్లాడుతూ ఎకరానికి 600గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పి సర్టిఫికెట్ ఇచ్చి గత ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేసిందని గుర్తు చేశారు. కానీ.. మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ రైతులకు స్థలాన్ని చూపించలేకపోయారని తెలిపారు. తక్షణమే రైతులకు న్యాయం చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, నాయకులు రాజుగౌడ్, నరేందర్‌గౌడ్, పుట్టి భాస్కర్, మహేశ్ పాల్గొన్నారు.

◆ విజయశాంతిని కలిసిన నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ మాజీ ఎంపీ విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి షేక్ అబ్దుల్ ఘనీ ఆధ్వర్యంలో ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్, షేక్ అబ్దుల్ ఖయ్యూంలు పాల్గొన్నారు.

◆ గర్భిణులకు వైద్య పరీక్షలు

మునిపల్లి(అందోల్): గర్భిణులు, బాలింతలు నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుజారెడ్డి అన్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సోమవారం వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్ర, సోమవారాల్లో బాలింతలకు వారంలో రెండు రోజులు, మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ చెకప్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 8 సబ్‌సెంటర్లుండగా ఉండగా ప్రతి నెల 8, 9వ మంది గర్భిణులకు చికిత్సలు బీపీ, పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం వ్యాధుల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ నాణ్యమైన విత్తనాలు అందించాలి

జహీరాబాద్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను కిసాన్ అగ్రి మాల్ ద్వారా అందించాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి సూచించారు. సోమవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లికార్జున్ కిసాన్ అగ్రిమాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాల్‌లో రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పరికరాలు ఒకే దగ్గర లభించనున్నాయన్నారు. ఈ మేరకు దీన్ని ఏర్పాటు చేసిన యజమాని ఎస్.రవీందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఏఈఓ ప్రదీప్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రామకృష్ణారెడ్డి, గుండప్ప, రైతులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద రూ.40లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సోమవారం కార్పొరేటర్ పుష్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతను తరలించొద్దు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గాంధీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న సంతను అంబేడ్కర్ చౌరస్తాకు తరలించొద్దని గ్రామ వర్తక సంఘం సభ్యులు సోమవారం గ్రామ పంచాయతీ ఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇక్కడి నుంచి సంతను తరలిస్తే తమ వ్యాపారాలకు తీవ్ర నష్టం జరుగుతుందని వర్తక సంఘం సభ్యులు అధికారులకు వివరించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నారాయణఖేడ్: పట్టణ శివారులో కేజీబీవీ వసతి గృహం పక్కన ఉన్న ప్రభుత్వ గిరిజన పోస్ట్ మెట్రిక్ కళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్, డిప్లమా చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కోసం దరఖాస్తులు సమర్పించాలని హెచ్‌డబ్ల్యూఓ బాలమణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 సీట్లకుగాను 80 సీట్లు ఖాళీ ఉన్నాయని, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యను అభ్యసించేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్టల్‌లో చేరాలనుకునేవారు కులం, ఆదాయం, బోనఫైడ్, ఆధార్ కార్డ్ ప్రతులతో పాటు 2 పాస్ ఫోటోలు, 10వ తరగతి మెమో, హాల్ టికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం ప్రభుత్వ గిరిజన పోస్ట్ మెట్రిక్ కళాశాల వసతి గృహంలో సంప్రదించాలని సూచించారు.

ఖర్గేను కలిసిన ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్‌షెట్కార్ గెలుపుకోసం ఉజ్వల్‌రెడ్డి ఎంతోకృషి చేశారు. అంతకుముందు ఉజ్వల్‌రెడ్డి కర్ణాటకలోని గుల్బర్గా ఎంపీ రాధాకృష్ణ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

సంగారెడ్డి టౌన్: వివో పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కార్యాలయంలో డీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. నెల వేతనాలను సరైన సమయంలో ఇవ్వాలని కోరారు.

కిరాణ షాపుల తనిఖీ

మునిపల్లి(అందోల్): మండల కేంద్రంలోని పలు కిరాణ షాపులను అద్నూర ఎస్ఐ రామనాయుడు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



శ్రీనివాస్ దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుడు బాచ శ్రీనివాస్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాచ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న షీటీం ఎస్ఐ నాగలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: ప్రతిఒక్కరూ మహిళలను గౌరవిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని షీటీం ఎస్ఐ నాగలక్ష్మి అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టాలు, మహిళలు, బాలికలు సంబంధించిన చట్టాలు, హెల్ప్ లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీ-టీంకు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీరామ్, సుధాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డంపుయార్డును కూల్చివేయడం తగదు



ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మంగంపేట గ్రామంలోని 55 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని టీఎస్ఐఐసీ ద్వారా ఓ పరిశ్రమకు అధికారులు కేటాయించారు. ఈ భూమిలో ఉన్న డంప్ యార్డు, దేవాలయంతో పాటు ఓ లింకురోడ్డును యాజమాన్యం కూల్చివేశారని ఆరోపిస్తూ సోమవారం మంగంపేట గ్రామస్తులు ఆర్డీఓ వసంతకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి ఉపయోగపడే డంప్‌యార్డును కూల్చివేయటం సరైంది కాదన్నారు. వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని కూడా కూల్చివేశారన్నారు. ఓ లింకురోడ్డు ఈ భూమిలోంచే ఉందని తెలిపారు. గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా తమకు మరో భూమిని కేటాయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళం



బ్యాంక్ మేనేజర్‌కు చెక్కు అంజేస్తున్న మల్లయ్యస్వామి దంపతులు

జహీరాబాద్ టౌన్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సైనిక సంక్షేమ నిధికి విరాళం అందజేశారు. ఈ మేరకు రూ.25 వేల చెక్కును సోమవారం ఎస్‌బీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సింధిలియాకు అందజేశారు. పట్టణంలోని మహీంద్ర కాలనీలో నివాసం ఉంటున్న మల్లయ్యస్వామి మండల పరిధిలోని అల్గోల్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరి వివాహం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తమ వంతుగా సైనిక సంక్షేమానికి రూ.25 వేలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. వివాహ రజతోత్సవం సందర్భంగా సైనికుల సాయం కోసం ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వచ్చిన దంపతులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు శ్రీనివాస్‌రావు, జగదీశ్ పాల్గొన్నారు.

ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీలు

విద్యా బోధనపై శిక్షణా తరగతులు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు(ప్రీ స్కూల్స్‌గా) తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు విద్యా బోధనపై శిక్షణ ఇస్తుంది. సోమవారం ప్రారంభమైన శిక్షణ తరగతులు జులై 7వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మేరకు మండలంలోని రంజోల్‌లోని రైతువేదిక కోహీర్ మండలంలోని దిగ్వాల్ పీహెచ్‌సీలో రెండు బ్యాచ్‌ల వారికి జహీరాబాద్ ప్రాజెక్టు సీడీపీఓ సునీతాబాయి సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఒక్కో శిక్షణ కేంద్రంలో 35 మంది టీచర్లు పాల్గొంటున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నీరజాగ్రెస్, అనితకుమారి, రాధమ్మ, పోషణ అభియాన్ బీసీ పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు పిల్లల బోధనపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వేజర్లు మానెమ్మ, ప్రతిభ, సల్మా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా బోధించాలి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఆకట్టుకునేలా బోధించాలని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. నారాయణఖేడ్, మనూరు మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ కరికులమ్ శిక్షణ నిర్వహించారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రతినిధులు బోధనా తీరును వివరిస్తూ అవగాహన కల్పించారు.

మెలకువలను పాటించండి

నారాయణఖేడ్: పంట సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలని ఏడీఏ నూతన్ కుమార్ సూచించారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలో పత్తి పంట సాగు చేసిన రైతు రాంశెట్టి వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం మండలంలోని వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వెంకటేశం, మహిపాల్, సంతోశ్ పాల్గొన్నారు.

క్రషర్ పనులను నిలిపివేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామ శివారులో నూతన కంకర క్రషర్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టర్, మైనింగ్, పీసీబీ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మరో కంకర క్రషర్ అంటే తాము గ్రామంలో బతకటం కష్టమవుతుందన్నారు. గ్రామంలోని చెరువులు కలుషితమవుతున్నాయని, దట్టమైన తెల్లటి పొగతో రోగాల బారిన పడుతున్నామని, బ్లాస్టింగ్‌లు చేస్తుండటంతో ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే క్రషర్ నిర్మాణ పనులను ఆపేలా అధికారులు, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రామకృష్ణ, సాయిగౌడ్, మల్లేశ్, జింక రవి, బాల్‌రాజ్, మహేశ్, అంజిగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ సర్వేకు మోక్షం

జహీరాబాద్: జహీరాబాద్ నుంచి తాండూర్‌కు కొత్త రైల్వేలైన్ అవసరం విషయమై రెండేళ్ల కాలంగా చేసిన కృషి ఫలితంగానే సర్వే పనులు చేపట్టినట్లు బీఎంఎస్ జాతీయ మాజీ అధ్యక్షుడు, కోల్ సెక్టార్ బీఎంఎస్ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీదర్ నుంచి బెంగుళూరు రైళ్లు నడుపుతున్నందునాన అదనపు ప్రయాణం చేయాల్సి వస్తోందని, కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిన విషయమై 2022 ఫిబ్రవరి 11వ తేదీన రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి కొత్త రైల్వే లైన్ కోసం ప్రయత్నం చేయడంతో ప్రభుత్వం ఎట్టకేలకు రైల్వే లైన్‌ను మంజూరు చేసిందన్నారు. సర్వే చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.